తొలిరోజు 94.14 శాతం హాజరు

- ఇంటర్ పరీక్షలు ప్రారంభం
- ఫస్టియర్ పరీక్షకు 7,055 మందికి 6,642 మంది హాజరు
- ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి సత్యనారాయణ

మెదక్ జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. జిల్లావ్యాప్తంగా 30 పరీక్ష కేంద్రాల్లో ప్రథమ సంవత్సరం పరీక్షలకు 7,055 మందికి 6,642 మంది హాజరయ్యారు. 413 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి సత్యనారాయణ తెలిపారు. జనరల్ విభాగంలో 6,471 మందికి 6,113 మంది, ఒకేషన్ విభాగంలో 584 మందికి 529 మంది విద్యార్థులు హాజరయ్యారు. జిల్లావ్యాప్తంగా 94.14శాతం మంది పరీక్షలకు హాజరయ్యారని, 6శాతం మంది హాజరుకాలేదన్నారు. పరీక్ష కేంద్రాలకు గంట ముందే అనుమతించినట్లు తెలిపారు. జిల్లాలో ఎక్కడా డిబార్ లేదా మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడలేదన్నారు. జిల్లాలోని అన్ని పరీక్ష కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించడంతో ఎలాంటి ఇబ్బందులు ఏర్పడలేదన్నారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటుచేశారు. జిల్లాకేంద్రంలోని పలు పరీక్షా కేంద్రాలను నోడల్ అధికారి సందర్శించారు. పరీక్ష కేంద్రాల్లో మౌలిక సదుపాయల ఏర్పాట్లను ఆయన పరిశీలించారు.

- మెదక్ జిల్లా నెట్‌వర్క్, ఫిబ్రవరి 28

రామాయంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

పాపన్నపేటలో విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

నర్సాపూర్‌లో పరీక్ష కేంద్రం నుంచి పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

వెల్దుర్తి ప్రభుత్వ కళాశాలలో హాల్‌టికెట్ నంబర్లు చుసుకుంటున్న విద్యార్థులు

బీవీఆర్ఐటీ విద్యార్థులకు ఉత్తమ అవార్డు

కేరళ లో అవార్డు అందుకుంటున్న బీవీఆర్ఐటీ విద్యార్థులు

నర్సాపూర్, ఫిబ్రవరి 28: సివిల్ ఇంజినీరింగ్ స్ట్రీమ్‌లో ఉత్తమ ప్రాజెక్ట్ తయారు చేసిన నర్సాపూర్ సమీపంలోని బీవీఆర్ఐటీ కళాశాల సివిల్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ విద్యార్థులు ప్రథమ బహుమతి(రూ.12వేలు) పొందారు. కేరళలోని కొట్టాయం సెయింట్‌గిట్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో శిష్ట 2024 10 వ జాతీయస్థాయి టెక్నికల్ ప్రాజెక్ట్ ఎగ్జిబిషన్, పోటీలను ఈ నెల 26, 27 తేదీల్లో నిర్వహించారు. ఈ పోటీల్లో పొడి మామిడి ఆకులను ఉపయోగించి కుదించబడిన కలపపై బీవీఆర్ ఐటీ కళాశాల విద్యార్థులు ప్రయోగాత్మక అధ్యయనం చేశారు. ఈ అధ్యయనంపై కళాశాల ఫ్యాకల్టీ సంగమేశ్ బిరాదార్ మార్గనిర్దేశం చేశారు. జట్టు సభ్యులు భానుతేజ, ప్రశాంత్, సాయిభాను ప్రసాద్ చారి, సందీప్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల బృందం విద్యార్థులను అభినందించారు.

రాష్ట్రస్థాయి కబడ్డీకి పురుషుల జట్టు ఎంపిక

రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపికైన మెదక్ జిల్లా జట్టు

మెదక్ రూరల్, ఫిబ్రవరి 28: కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో మండలంలోని మాచవరం మైదానంలో జిల్లాస్థాయి కబడ్డీ జట్టును బుధవారం ఎంపిక చేశారు. ఈ సందర్భంగా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, డీఎస్‌వైవో నాగరాజు మాట్లాడుతూ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేశామన్నారు. ఈ జట్టు మార్చి లో నల్లగొండ జిల్లాలోని నాగార్జున సాగర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి క్రీడల్లో ఆడుతుందన్నారు. కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేశ్, ఉపాధ్యక్షులు కుమార్, రవి, శశికుమార్, సాయిలు, శివప్రభాకర్, కోశాధికారి రవి, వ్యాయామ ఉపాధ్యాయులు ఉన్నారు.

నర్సాపూర్ ఆర్డీవో బదిలీ

శ్రీనివాసులు

నర్సాపూర్, ఫిబ్రవరి 28: రాష్ట్ర ప్రభుత్వం వివిధ శాఖలకు చెందిన అధికారుల బదిలీలు చేపట్టింది. ఇందులో భాగంగా బుధవారం నర్సాపూర్ రెవెన్యూ డివిజన్ ఆర్డీవోగా బాధ్యతలు నిర్వహిస్తున్న శ్రీనివాసులు హుజూర్‌నగర్‌కు బదిలీ అయ్యారు.

బీఆర్ అంబేద్కర్ ఆశయాలు సాధించాలి

ఆర్.వెంకటాపూర్‌లో అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేస్తున్న నేతలు

రామాయంపేట, ఫిబ్రవరి 28: అంబేద్కర్ ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు రాజు మాదిగ, జైభీమ్ నాయకుడు నర్సింహులు అన్నారు. బుధవారం ఆర్‌వెంకటాపూర్ గ్రామంలో అంబేద్కర్ సంఘం నాయకుడు స్వామి ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహ ప్రతిష్టకు భూమి పూజచేశారు. కార్యక్రమంలో కొమ్మగళ్ల స్వామి, బండారి శ్రీనువాస్, కిషన్, కృష్ణ తదితరులు ఉన్నారు.

వ్యక్తి అదృశ్యం

రమేశ్(ఫైల్)

టేక్మాల్, ఫిబ్రవరి 28 : మండలంలోని రంగన్నపల్లి గ్రామానికి చెందిన ఒక వ్యక్తి అదృశ్యమైన ఘటన టేక్మాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగన్నపల్లికి చెందిన ఇట్టిగారి రమేశ్ ఈ నెల 13న మద్యం తాగి ఇంటికి వచ్చి భార్య తులసమ్మతో గొడవపడ్డాడు. అనంతరం రమేశ్ బయటకు వెళ్లి, తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గ్రామాల్లో, బంధువుల వద్ద ఆరా తీయగా ఎలాంటి ఫలితం లేదు. దీంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నేడు పంచముఖి హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠ

వెల్దుర్తి, ఫిబ్రవరి 28: మేల్లూరు గ్రామ శివారులోని బాలాత్రిపురసుందరి ఆలయంలో పంచముఖి హనుమాన్ సహిత శివలింగం, నంది విగ్రహాలను గురువారం ప్రతిష్ఠించనున్నట్లు నిర్వాహకుడు సిద్ధిరాములుగౌడ్ తెలిపారు. ఆలయంలో గణపతిపూజ, పుణ్యవాచనం, అంకురారోహణం, అఖండదీపం, వాస్తు పూజ, నవగ్రహ పూజ, అగ్నిప్రతిష్ఠ, పంచముఖి హనుమాన్, శివలింగ యంత్ర ప్రతిష్ఠాపన నిర్వహించనున్నట్లు తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-319447-All
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

శాస్త్రీయ ఆలోచనలు వికసించాలి

- జిల్లావ్యాప్తంగా జాతీయ సైన్స్ దినోత్సవం
- విద్యాసంస్థల్లో ప్రతిభా పోటీలు
- పరిశోధనలపై దృష్టి పెట్టాలి
- ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు

శివ్వంపేట : గూడురు కేజీబీవీలో సైన్స్‌ఫెయిర్‌ను పరిశీలిస్తున్న డీఈవో రాధాకిషన్

ఫిబ్రవరి 28 : జిల్లాకేంద్రంలోని విద్యా సంస్థల్లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. సీవీ రామన్ కనుగొన్న రామన్ ఎఫెక్ట్, ఇతర పరిశోధనలను, ఆయన జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు ప్రయోగాల చార్టులను ప్రదర్శించారు. విద్యాసంస్థల్లో ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు మాటాడ్లారు. విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలు వికసించాలన్నారు. పరిశోధనలపై దృష్టి పెట్టి నూతన ఆవిష్కరణలు చేయాలని సూచించారు. విద్యార్థుల్లో శాస్త్రీయ వైఖరి పెంపొందితే దేశం శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ముందుకు వెళ్తుందని ఉపాధ్యాయులు వివరించారు. విద్యార్థులు సృజనాత్మకత శక్తిని పెంపొందించుకోని కొత్త కొత్త ఆలోచనలు చేసి దేశ అభివృద్ధిలో తమవంతు పాత్ర పోషించాలని జిల్లా విద్యాధికారి రాధాకిషన్ అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకొని జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శివ్వంపేట మండలం పెద్దగొట్టిముక్ల, గూడూరు కేజీబీవీ పాఠశాలను డీఈవో రాధాకిషన్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి సందర్శించారు. విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని, మూఢనమ్మకాలను నమ్మకూడదని సూచించారు. వీరి వెంట అకాడమిక్ మానిటరింగ్ అధికారి సుదర్శనమూర్తి, ఎంఈవో బుచ్యానాయక్, హెచ్ఎం మంజుల తదితరులు ఉన్నారు.

- మెదక్ జిల్లా నెట్‌వర్క్, ఫిబ్రవరి 28

చిన్నశంకరంపేట : సూరారం పాఠశాలలో..

మెదక్ మున్సిపాలిటీ : విద్యార్థులు నమూనాల ప్రదర్శన

నర్సాపూర్ విష్ణు పాఠశాలలో ప్రయోగాల పదర్శన

చేగుంట : ప్రయోగాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

పాపన్నపేట : కుర్తివాడ పాఠశాలలో సైన్స్ దినోత్సవ వేడుకలు

మెదక్ రూరల్ : నమూనాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

నిజాంపేట : నమూనాలను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

పెద్దశంకరంపేటలో బాలికల ఉన్నత పాఠశాలలో సైన్స్‌ఫెయిర్

రామాయంపేటలో ప్రయోగాలను పరిశీలిస్తున్న ఎస్సైరంజిత్

నర్సాపూర్ పట్టణాభివృద్ధిపై సమీక్ష

సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్

నర్సాపూర్, ఫిబ్రవరి 28 : నర్సాపూర్ మున్సిపాలిటీ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ అధ్యక్షతన పట్టణాభివృద్ధిపై వివిధ శాఖల అధికారులతో బుధవారం సమీక్షించారు. ఇంటి పన్ను, మంచినీటి సరఫరా, వీధి దీపాలు, పారిశుధ్య నిర్వహణ తదితర అంశాలపై సమీక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ మధుసూదన్, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, వార్డు అధికారులు, బిల్ కలెక్టర్, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు
ముందస్తు చర్యలు తీసుకోవాలి

అధికారులతో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో ఎల్లయ్య

- జడ్పీ సీఈవో ఎల్లయ్య

వెల్దుర్తి, ఫిబ్రవరి 28: వేసవి ప్రారంభం కానుండంతో గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని మండలాధికారులను జడ్పీ సీఈవో ఎల్లయ్య ఆదేశించారు. బుధవారం వెల్దుర్తి ఎంపీడీవో కార్యాలయాన్ని జడ్పీ డిప్యూటీ సీఈవో రంగాచార్యతో కలిసి సందర్శించారు. కార్యాలయంలో రికార్డులు పరిశీలించి సిబ్బందిని అభినందించారు. గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యలు ఏవైనాఉంటే తమ దృష్టికి తీసుకొస్తే ప్రత్యేక నిధుల నుంచి మరమ్మతులు చేయించడానికి కృషి చేస్తామన్నారు. బీఆర్ఎస్ నాయకుడు కృష్ణగౌడ్, ఎస్ఎంసీ చైర్మన్ వెంకటేశం జడ్పీ సీఈవోను కలిశారు.

మాజీ కౌన్సిలర్‌పై చర్యలు తీసుకోవాలి

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 28: మున్సిపల్ సిబ్బందిపై దుర్భాషలాడిన మాజీ కౌన్సిలర్ మేడి మధుసూదన్‌రావుపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ ఉద్యోగులు కార్యాలయం ఎదుట బుధవారం నిరసన వ్యక్తం చేశారు. కార్యాలయ ఇన్‌చార్జి ఆర్ఐ బాబు, బిల్ కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, సిబ్బంది ఆబేద్‌ను వివిధ సందర్భాల్లో దుర్భాషలాడినట్లు పేర్కొన్నారు. ఒక ఇంటి విషయంలో సరైన పత్రాలు సమర్పించకపోవడంతో మ్యూటేషన్‌ను తిరస్కరిస్తే ఎందుకు అని అడిగినందుకు దుర్భాషలాడినట్లు తెలిపారు. ఆయనపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కమిషనర్ జాన కీరామ్‌సాగర్‌కు వినతిపత్రం అందజేశారు.

గవర్నర్‌ను కలిసిన ఎమ్మెల్యే రోహిత్

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 28: మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసైను బుధవారం మర్యాదపూర్వకంగా పుష్పగుచ్ఛం అందజేశారు.

లక్ష్మీ నర్సింహ స్వామి
కల్యాణం కమనీయం

చేగుంట, ఫిబ్రవరి 28: మండలంలోని కొండపూర్(బీ) సింగరాయునిగుట్ట లక్ష్మీనర్సింహస్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ బీఆర్ఎస్ జిల్లా నేత రంగయ్యగారి రాజిరెడ్డి కుటుంబీకులు స్వామికి పట్టువస్త్రాలు సమర్పించారు. జాతర ఖర్చులకు రూ.లక్షా16వేలు అందజేశారు. కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి పట్టువస్త్రాలు, రూ.51వేల విరాళాన్ని అందజేశారు. అనంతరం అన్నదానం చేశారు. గురువారం దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పూజల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ అంజిరెడ్డి, మాజీ సర్పంచ్‌లు ప్రవీణారాజిరెడ్డి, బాల్‌నర్సు, ఎంపీటీసీ నవీన్, మాజీ ఉపసర్పంచ్ రమేశ్, శ్రీనివాస్‌గుప్తా, ఆలయ అభివృద్ధి మేనేజింగ్ ట్రస్టీ నర్సింగరావు, సభ్యులు ప్రసాదచారి, శ్రీనివాసచారి, సుదర్శనచారి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ నిలిపివేత

చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 28: చిన్నశంకరంపేటలోని 33/11కేవి విద్యుత్ ఉపకేంద్రం మరమ్మతుల నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ఆ శాఖ ఏఈ సతీశ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కామారం, రుద్రారం, చందంపేట, చిన్నశంకరంపేట పారిశ్రామిక వాడల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. రైతులు, వినియోగదారులు సహకరించాలని కోరారు.

కార్పొరేట్‌కు బీజేపీ దాసోహం

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు దేవయ్య

సదస్సులో మాట్లాడుతున్న దేవయ్య

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 28: కార్పొరేట్ సంస్థలకు బీజేపీ దాసోహమని, గెలిస్తే సాగు భూములన్నీ ఆ సంస్థలకే అప్పజెప్తారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు దేవయ్య అన్నారు. బుధవారం ఆ సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కేవల్ కిషన్ భవన్‌లో పోడు, సాగు భూములు, ఇండ్ల స్థలాల సమస్యల పరిష్కారానికి జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మరోసారి బీజేపీ అధికారంలోకి వస్తే జిల్లాలోని సాగు, అడవి భూములు కార్పొరేట్ సంస్థలు అప్పగిస్తారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యలను వెంటనే పరిష్కారిచాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీరు మార్చుకుని పోడు భూములకు హక్కుపత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సదస్సులో నాయకులు మల్లేశం, లచ్చాగౌడ్, స్వామి, యాదగిరి, ఐలయ్య, శేఖర్, నయూమొదీన్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

లీపర్స్.. బెస్ట్ కపుల్స్

- నాలుగేండ్లకోసారి పెండ్లి వేడుకలు జరుపుకొంటున్న జంటలు

మెదక్ మున్సిపాలిటీ/ పెద్దశంకరంపేట, ఫిబ్రవరి 28 : ప్రతి నాలుగేండ్లకోసారి లీపు సంవత్సరం వస్తుంది. నాలుగేళ్లకోసారి పెండ్లి రోజు జరుపుకొంటారు. ఫిబ్రవరి 29న పుట్టినవారు, పెండ్లిళ్లు చేసుకున్నవారు నాలుగేళ్లకోసారి వేడుకలు జరుపుకొంటారు. ఈ తేదీన పుట్టినవారిని 'లీప్ లింగ్స్' లేదా 'లీపర్స్' అని పిలుస్తారు.

పెండ్లి జరిగి ఇరవై ఏండ్లు

మెదక్‌లోని వెంకట్రావ్‌నగర్ కాలనీకి చెందిన గ్యాస్ గిరి, మహేశ్వరి దంపతులు. వీరి పెళ్లి 2004 ఫిబ్రవరి 29న పెండ్లి జరిగింది. దీంతో నాలుగేండ్లకోసారి వచ్చే పెండ్లి రోజును కుటుంబీకులు, బంధువుల మధ్య ఘనంగా జరుపుకొంటారు. పెండ్లి జరిగి ఇరవై ఏండ్లు అవుతున్నా వీరికి ఇది ఐదో పెళ్లి రోజు.

- గిరి, మహేశ్వరి దంపతులు

ఎంతో ఆశగా ఎదురుచూస్తాం

మా పెండ్లి జరిగి 20 ఏండ్లు అవుతున్నది. ఇప్పటివరకు ఐదో పెండ్లి రోజు జరుపుకొంటున్నాం.. ఆనందంగా ఉంది. మాది పెద్దశంకరంపేట. నాలుగేండ్లకోసారి వచ్చే పెండ్లి రోజుకోసం ఎంతో ఆశగా ఎదురుచూస్తుంటాం. ఈ రోజు చాలా సంతోషంగా గడిపేలా పిల్లలతో కలిసి ప్లాన్ చేసుకుంటాం.

- జిన్న సాయిరాం, స్వప్న దంపతులు

ఎరువులను అధిక ధరకు
విక్రయిస్తే కఠిన చర్యలు

చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 28: ఎరువులు, పురుగు మందులను అధిక ధరలకు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఏవో లక్ష్మీప్రవీణ్ హెచ్చరించారు. బుధవారం చిన్నశంకరంపేటలో ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. మందులు కొనేటప్పుడు రైతులకు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని సూచించారు.

హల్దీ డ్యాం కుడి కాల్వ
పూడికతీత ప్రారంభం

చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 28: మండలంలోని ధర్పల్లి గ్రామంలో చెరువులను కుంటను నింపడం కోసం బుధవారం హల్దీ డ్యాం కుడి కాల్వ పూడికతీత పనులను ప్రారంభించారు. హల్దీ డ్యాం కుడి కాల్వ ద్వారా నీటిని తీసుకొచ్చి ధర్పల్లి గ్రామ శివారులోని చెరువులు, కుంటలను నింపి యాసంగి సాగుకు నీటిని అందించనున్నారు.

రేణుకాఎల్లమ్మ ఆలయంలో చోరీ

మాసాయిపేటలో రేణుకాఎల్లమ్మ ఆలయాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

వెల్దుర్తి, ఫిబ్రవరి 28: మాసాయిపేటలోని రేణుకాఎల్లమ్మ ఆలయంలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. దొంగలు రెండున్నర కిలోల వెండి నగలు, అర తులం ముక్కుపుడక, పుస్తెలతోపాటు సీసీ కెమెరాల హార్డ్‌డిస్క్ దొంగిలించారు. రూ. 2లక్షల విలువైన వస్తువులు చోరీకి గురైనట్లు గౌడ సంఘం సభ్యులు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.